
సాక్షి

శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

ఆదివారం । 6 । జూలై । 2025



సోమశిలలో 30.290 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో శనివారానికి 30.290 టీఎంసీలు ఉన్నాయి. పెన్నార్ డెల్టాకు 2,610, ఉత్తర, దక్షిణ కాలువలకు 1,275 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.1,00,100
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.9,060
3 శాతం జీఎస్టీతో	రూ.9,332
నవర (8 గ్రా)	రూ.74,656

గరిష్టం/కనిష్టం
38.2 /30.0

వాతావరణం

జిల్లాలో ఆదివారం వాతావరణం పాక్షికంగా మేఘావృతంగా ఉంటుంది. పగటి ఉష్ణోగ్రతలు అధికంగా ఉంటాయి. శనివారం గాలిలో తేమ 45 శాతంగా నమోదైంది.

న్యూస్‌రీల్

తొమ్మిదేళ్ల బాలికపై అత్యాచార యత్నం

నెల్లూరు సిటీ: తొమ్మిదేళ్ల బాలికపై ఓ వ్యక్తి అత్యాచారయత్నం చేసిన ఘటన ఆలస్యంగా శనివారం వెలుగులోకి వచ్చింది. నెల్లూరు రూరల్ మండలం నవలాకులతోట అంబేడ్కర్ నగర్ ప్రాంతానికి చెందిన ఓ బాలిక మూడో తరగతి చదువుతోంది. అదే ప్రాంతంలో గదిని అద్దెకు తీసుకుని నివసిస్తున్న వీ శీనయ్య (32) మినరల్ వాటర్ ప్లాంట్‌లో సప్లయిర్‌గా పని చేస్తున్నాడు. ఈ నెల 2వ తేదీ బాలిక ఇంటి వద్ద ఆడుకుంటున్న సమయంలో శీనయ్య మాయమాటలు చెప్పి ఇంట్లోకి తీసుకెళ్లాడు. బాలికపై అత్యాచార యత్నం చేశాడు. ఇంట్లో చెబితే చంపేస్తానని బాలికను బెదిరించాడు. దీంతో బాలిక తల్లిదండ్రులతో కలిసి వెళుతుండగా శీనయ్యను చూసి భయపడడంతో అనుమానం వచ్చి ఆరా తీశారు. జరిగిన విషయాన్ని బాలిక తల్లిదండ్రులకు చెప్పడంతో శనివారం నెల్లూరు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వాణిజ్య పన్నుల శాఖలో బదిలీలు

నెల్లూరు (టౌన్): నెల్లూరు డివిజన్ పరిధిలోని నెల్లూరు, ప్రకాశం జిల్లాల్లో వాణిజ్య పన్నుల శాఖ (స్టేట్ ట్యాక్స్)లో పనిచేస్తున్న పలువురు అధికారులను బదిలీ చేశారు. నెల్లూరు డివిజన్ జేసీ ఎ.రవీంద్రనాథ్‌రెడ్డిని చిత్తూరుకు బదిలీ చేశారు. విశాఖపట్నం జేసీ వై.కిరణ్‌కుమార్ నెల్లూరుకు బదిలీ అయ్యారు. డిప్యూటీ కమిషనర్ డీఎంకే తులసిని విజయవాడ కమిషనర్ కార్యాలయానికి, కాకినాడలో డిప్యూటీ కమిషనర్‌గా పనిచేస్తున్న సత్యప్రకాష్‌ను నెల్లూరుకు బదిలీ చేశారు. నెల్లూరు-1 సర్కిల్‌లో ఏసీగా పనిచేస్తున్న డి.శివ ప్రసాదరావును మంగళగిరి సర్కిల్‌కు, ఒంగోలు-2 సర్కిల్‌లో పనిచేస్తున్న ఏసీ సోమసుందర ప్రసాద్‌ను నెల్లూరు-1 సర్కిల్‌కు, నెల్లూరు-3 సర్కిల్‌లో ఏసీగా పనిచేస్తున్న గోపిచంద్‌ను విజయవాడ-3 సర్కిల్‌కు, ఒంగోలు-1 సర్కిల్‌లో ఏసీగా పనిచేస్తున్న వర్షిణికుమావత్‌ను కాకినాడ పోర్టు సర్కిల్‌కు, నెల్లూరు-2 సర్కిల్‌లో ఏసీగా పనిచేస్తున్న సింధుప్రియను అచ్యుతాపురం సర్కిల్‌కు, మార్కాపురం సర్కిల్‌లో పనిచేస్తున్న కరీం బాషాను తిరుపతి-3 సర్కిల్‌కు, కావలి సర్కిల్‌లో పనిచేస్తున్న ధనలక్ష్మిని విజయవాడ రీజనల్ ఆఫీసుకు బదిలీ చేశారు. వీరితో పాటు పలువురు డిప్యూటీ కమిషనర్లు కూడా ఆయా ప్రాంతాలకు బదిలీ అయ్యారు.

రాష్ట్ర సోషల్ మీడియా సంయుక్త కార్యదర్శిగా ప్రభాకర్

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు నెల్లూరు నగర నియోజకవర్గానికి చెందిన మల్లిబోయిన ప్రభాకర్‌ను రాష్ట్ర సోషల్ మీడియా విభాగం సంయుక్త కార్యదర్శిగా నియమిస్తూ శనివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు.



స్వర్ణాల చెరువులో భక్తుల సందడి

మత సామరస్యానికి ప్రతీకగా జరిగే రొట్టెల పండగ ఆదివారం నుంచి ప్రారంభం కానుంది. ఐదు రోజుల పాటు జరిగే ఈ పండగకు సింహపురి దారులన్నీ బారాషహీద్ దర్గా వైపే మళ్లాయి. కోర్కెలు తీరిన భక్తులు రొట్టెలు వదిలేందుకు, కొత్త కోర్కెల రొట్టెలు పట్టుకునేందుకు ముందు రోజే భక్తులు పోటెత్తడంతో దర్గా ప్రాంగణం కిటకిటలాడుతోంది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులే కాకుండా కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర, తెలంగాణ ప్రాంతాల నుంచి భక్తులు రావడంతో స్వర్ణాల చెరువు భక్తజనసంద్రంగా మారింది.

కోర్కెలు తీరగా.. మళ్లీ రావాలిగా

నేటి నుంచి రొట్టెల పండగ ప్రారంభం

- కళకళలాడుతున్న దర్గా ప్రాంగణం
- బారాషహీద్ దర్గాకు పోటెత్తుతున్న భక్తులు
- స్వర్ణాల చెరువులో కోర్కెల రొట్టెల మార్పిడి సందడి



బారాషహీద్ దర్గా

నెల్లూరు (బారకాసు): నెల్లూరుకు రొట్టెల పండగొచ్చింది. నగరంలోని దర్గామిట్టలో ఉన్న బారాషహీద్ దర్గాలో రొట్టెల పండగకు అవసరమైన ఏర్పాట్లన్నీ అధికారులు సర్వం సిద్ధం చేశారు. ఆదివారం నుంచి ప్రారంభమయ్యే ఈ రొట్టెల పండగ ఐదు రోజుల పాటు నిర్వహించనున్నారు. నెల్లూరులో జరిగే రొట్టెల పండగకు ఎంతో విశిష్టత ఉంది. దేశ, విదేశాల నుంచి భక్తులు తరలి వస్తుంటారు. బారాషహీద్‌లను స్మరిస్తూ కోర్కెలు తీరాలని స్వర్ణాల చెరువులో ఒకరికొకరు రొట్టెలను మార్చుకుంటారు. ఆ కోర్కెలు తీరిన తర్వాత మళ్లీ వచ్చి రొట్టెను వదులుతారు. మరో కోర్కె రొట్టెను తీసుకెళ్తుంటారు. దర్గా ప్రాంగణంలో విద్యుత్ వెలుగులు విరజిమ్ముతున్నాయి.

స్వర్ణాల చెరువులో భక్తుల సందడి

రొట్టెల మార్చుకునే స్వర్ణాల చెరువు భక్తులతో సందడి నెలకొంది. పండగ ప్రారంభానికి ముందే భక్తుల రాకతో బారాషహీద్ దర్గా ప్రాంగణం కిటకిటలాడుతోంది. శనివారం ఉదయం నుంచి స్వర్ణాల చెరువు వద్ద కోర్కెల రొట్టెలను మార్చుకున్నారు. రెండు రోజుల ముందు నుంచే వివిధ రాష్ట్రాల నుంచి భక్తులు బారాషహీద్ దర్గాకు చేరుకుంటున్నారు. నగర పాలక సంస్థ, పోలీసు, విద్యుత్, ఆరోగ్య, రెవెన్యూ శాఖలతోపాటు, ఇతర శాఖల అధికారులు సమన్వయంతో అన్ని ఏర్పాట్లు చేశారు.

భక్తులకు సౌకర్యాల కల్పన

జాతీయ రహదారి నుంచి నగరంలోకి ప్రవేశించే మార్గంలో బారాషహీద్ దర్గాకు రూట్ మ్యాప్ సూచిస్తూ భారీ ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. తాగు నీటి కేంద్రాలు, స్నానపు గదులు, మరుగుదొడ్లు మహిళలు, పురుషులకు వేర్వేరుగా నిర్మించారు. భక్తులకు అందుబాటులో 108 వాహనాలు, ఆరోగ్య కేంద్రాలు కల్పించారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు ఇబ్బంది పడకుండా షామియానాలు, పందిళ్లపైనా భారీ జింక్ షీట్‌లు ఏర్పాటు చేశారు. స్వర్ణాల చెరువు వద్ద భక్తులు ప్రమాదాలకు గురికాకుండా కంచెను ఏర్పాటు చేశారు. చెరువు వద్ద గజఈతగాళ్లను సిద్ధంగా ఉంచారు. చెరువులో నీరు మురుగు చేరకుండా ఎప్పటికప్పుడు మోటార్లతో శుద్ధి చేస్తున్నారు. దర్గా ఆవరణలో చిన్నారులు ఆడుకునేందుకు ఆట వస్తువులు, జైంట్‌వీల్స్ ఏర్పాటు చేశారు.

అధికారుల సమన్వయంతో

నగర పాలక సంస్థ, విద్యుత్, పోలీస్, వైద్య శాఖలతోపాటు ఇతర శాఖల అధికారులు సమన్వయంతో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. కలెక్టర్, ఎస్పీ, కార్పొరేషన్ కమిషనర్ ఇతర శాఖల అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించి సిబ్బందికి రొట్టెల పండగ నిర్వహణపై సూచనలు చేశారు.

ఐదు రోజుల పండగ

6వ తేదీ	- షహదత్
7వ తేదీ	- గంధమహోత్సవం
8వ తేదీ	- రొట్టెల పండగ
9వ తేదీ	- తహలీల్ ఫాతెహా
10వ తేదీ	- ముగింపు సభ

వేలాది మంది భక్తుల హాజరు

దర్గాకు శనివారం వేలాది మంది భక్తులు హాజరయ్యారు. కోర్కెల రొట్టెలను మార్చుకుని భక్తి శ్రద్ధలతో దర్గాను సందర్శించారు. తమిళనాడు, కేరళ, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాలతోపాటు ఆంధ్రరాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి భక్తులు అధికంగా హాజరయ్యారు. రొట్టెల పండగకు ముందుగానే భక్తులు భారీగా వచ్చే అవకాశం ఉండడంతో అధికారులు కూడా ఏర్పాట్లు పూర్తి స్థాయిలో చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు పడకుండా అన్ని చర్యలు తీసుకున్నారు.



రొట్టెల పండగకు వివిధ ప్రాంతాల నుంచి హాజరైన భక్తులు



దర్గాలో బారాషహీదులను దర్శించుకుంటున్న భక్తులు

అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం

రొట్టెల పండుగకు వచ్చే భక్తులకు అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశాం. క్షేత్రస్థాయిలో నిత్యం పరిశీలిస్తూ సిబ్బందికి తగు సూచనలు చేస్తున్నాం. బారాషహీద్ దర్గా ప్రాంగణ మొత్తం సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాం. 24గంటలు పాటు పోలీసు నిఘా ఉంటుంది. అన్ని శాఖల సమన్వయంతో పనిచేస్తున్నాం.

– ఆనంద్, కలెక్టర్.



అధికారులకు రాజకీయాలెందుకు?

- ఇబ్బందిగా ఉంటే రిజైన్ చేసి ఇంట్లో కూర్చోండి
- జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ



మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ

నెల్లూరు (పొగతోట): 'ప్రభుత్వాలు వస్తుంటాయి.. పోతుంటాయి.. అధికారులు మాత్రం సర్వీసులోనే ఉంటారు. అధికారులకు రాజకీయాలెందుకంటూ' జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ ఎంపీడీఓలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం జెడ్పీ సమావేశ మందిరంలో పంచాయతీ పురోగతి సూచిక కార్యక్రమంపై ఎంపీడీఓలు, పంచాయతీ సెక్రటరీలకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడారు. అధికారులు నిబంధనలు ప్రొటోకాల్ నిబంధనలు తప్పనిసరిగా పాటిస్తూ శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలకు జెడ్పీ చైర్‌పర్సన్, జెడ్పీటీసీలను, ఎంపీపీలను ఆహ్వానించాలన్నారు. ప్రొటోకాల్ విషయంలో అంత ఇబ్బంది పడేటట్లు అయితే రిజైన్ చేసి ఇంట్లో కూర్చోవాలని సూచించారు. ఇకపై ప్రొటోకాల్ విషయంలో ఘటన పునరావృతమైతే సహించేది లేదంటూ హెచ్చరించారు. ప్రస్తుత, భవిష్యత్ తరాల శ్రేయస్సు కోసం సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను రూపొందించుకుని 2030 నాటికి వాటిని సాధించు కోవాలన్నారు. ఈ లక్ష్య సాధన కోసం కేంద్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో పటిష్టమైన వ్యూహాన్ని రూపొందించిందన్నారు. పేదరికం లేని మెరుగైన జీవనోపాధి, ఆరోగ్య వంతమైన, స్వయం సమృద్ధిగల మౌలిక సదుపాయాలు, సామాజిక సురక్షితమైన, సుపరిపాలన, మహిళా స్నేహ పూర్వకమైన గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు క్షేత్ర స్థాయిలో అమలు చేయాలన్నారు. ప్రతి పంచాయతీలో 9 కార్యక్రమాల్లో ఏదో ఒకటి ఎంపిక చేసుకుని, సంపూర్ణంగా అమలు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రస్తుతం శిక్షణా కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుని పంచాయతీలను ఏ-గ్రేడ్‌లోకి తీసుకువచ్చేలా చర్యలు చేపట్టాలన్నారు. ఎంపీడీఓలు మండల సాధారణ నిధులు, 15వ ఆర్థిక సంఘం నిధులను ప్రజా ప్రతినిధులకు విడుదల చేయాలన్నారు. ఆత్మకూరు ఘటనకు సంబంధించి ఇంత వరకు నివేదికలు అందలేదన్నారు. నివేదికలను త్వరగా ఇవ్వాలని ఆత్మకూరు ఎంపీడీఓకు సూచించారు.

- జెడ్పీ సీఈఓ మోహన్‌రావు మాట్లాడుతూ పంచాయతీల అభివృద్ధికి సంబంధించి జిల్లా స్థాయిలో శిక్షణా కార్యక్రమాలు ఇవ్వడం జరిగిందన్నారు. ఈ నెల 9వ తేదీన శిక్షణకు హాజరైన అధికారులు మండల స్థాయిలో శిక్షణా కార్యక్రమాలు ఇవ్వాలని సూచించారు. లైన్ డిపార్ట్‌మెంట్‌లను కో ఆర్డినేషన్ చేసుకుని పంచాయతీలకు అవార్డులు వచ్చేలు ప్రణాళికలు రూపొందించాలన్నారు. జీపీడీపీ యాక్షన్ ప్లాన్లు పేపర్లలోనే జరుగుతున్నాయని, క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదన్నారు. పంచాయతీల అభివృద్ధికి సంబంధించి 147 అంశాలను పొందుపరిచారన్నారు. జరిగిన అభివృద్ధికి సంబంధించి పూర్తి వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. ఈ శిక్షణా కార్యక్రమంలో హౌసింగ్ పీడీ వేణుగోపాల్, ట్రైనర్ ప్రసాద్, ఎంపీడీఓలు, పంచాయతీ సెక్రటరీలు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నేతలకు రాష్ట్ర స్థాయి పదవులు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు నెల్లూరు జిల్లాలో పలు నియోజకవర్గాలకు చెందిన నాయకులను రాష్ట్ర సంయుక్త కార్యదర్శులుగా నియమిస్తూ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గానికి చెందిన వేమిరెడ్డి హంసకుమార్‌రెడ్డి, పేర్నేటి కోటేశ్వరరెడ్డి, సర్వేపల్లి నియోజకవర్గానికి చెందిన దాసరి భాస్కర్‌గౌడ్, కందుకూరు నియోజకవర్గానికి చెందిన వెలిచెర్ల ధన కోటేశ్వరరావు, నెల్లూరు సిటీ నియోజకవర్గానికి చెందిన కొణిదెలముని వెంకటసుధీర్, కె బాలకృష్ణారెడ్డిలను రాష్ట్ర సంయుక్త కార్యదర్శులుగా నియమిస్తూ పార్టీ కార్యాలయం ఉత్తర్వులను విడుదల చేసింది.

టీడీపీ నేత ఇంట్లోనే.. నకిలీ మద్యం తయారీ

కందుకూరు నియోజకవర్గంలో బెల్టు షాపులకు సరఫరా

- ఇందులో ఇద్దరు వ్యక్తుల పాత్ర
- గోదావరి, నెల్లూరు జిల్లాల్లో ఇటీవల ఎక్సైజ్ దాడులు
- ఈ దాడుల్లో పట్టుబడిన వారి సమాచారంతో సోదాలు
- అధికార పార్టీ నేతల అండదండలు ఉన్నట్లు సమాచారం

కూటమి పాలనలో కందుకూరు నియోజకవర్గంలో అధికార పార్టీ నేతలు చేయని అక్రమ వ్యాపారాల్లేవు. ఇప్పటికే ఇసుక, గ్రావెల్, రేషన్ బియ్యం, పేకాట, కోడి పందేలు, అసాంఘిక కార్యకలాపాల్లో ఆరితేరారు. తాజాగా ఓ టీడీపీ నేత ఏకంగా తన ఇంట్లోనే నకిలీ మద్యం తయారు చేస్తూ బెల్టు షాపులకు సరఫరా చేస్తూ మందుబాబుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న గుట్టును ఎక్సైజ్ అధికారులు రట్టు చేశారు. సదరు నేత అధికార పార్టీ నేతల అండదండలతో కొంత కాలంగా ఈ అక్రమ వ్యాపారానికి తెర తీసినట్లు తెలుస్తోంది. ఇటీవల గోదావరి, నెల్లూరు జిల్లాల్లో ఎక్సైజ్ అధికారులు చేసిన దాడుల్లో నకిలీ మద్యం తయారీ చేస్తూ పట్టుబడిన అధికార పార్టీ నేతలు ఇచ్చిన సమాచారం మేరకు తనిఖీలు చేయడంతో తెలుగు తమ్ముడి బాగోతం బయట పడినట్లు తెలుస్తోంది.



టీడీపీ నేత ఇంట్లో దొరికిన నకిలీ మద్యం సీసాలు

కందుకూరు: గుడ్లూరుకు చెందిన ఓ టీడీపీ నేత తన ఇంట్లోనే నకిలీ మద్యం తయారు చేస్తున్న గుట్టు శనివారం ఎక్సైజ్ అధికారులు దాడుల్లో రట్టయింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే బరితెగించిన టీడీపీ నేత ఉప్పలపాటి వీరాంజనేయరాజు తన ఇంట్లోనే నకిలీ మద్యం తయారు చేసి బెల్టుషాపుల ద్వారా విక్రయాలు సాగించినట్లు తెలుస్తోంది. శనివారం ఎక్సైజ్ అధికారులు చేసిన దాడుల్లోనే మద్యం తయారీకి ఉపయోగించే సుమారు 400 లీటర్ల రెక్టిఫైడ్ స్పిరిట్, మద్యం సీసాలు, తయారీకి ఉపయోగించే మెషిన్లతోపాటు రూ.లక్షలు విలువ చేసే మందు సామగ్రి స్వాధీనం చేసుకున్నారు. ఇందులో ఇద్దరి పాత్ర ఉన్నట్లు ఎక్సైజ్ అధికారులు గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. ఇటీవల గోదావరి, నెల్లూరు జిల్లాల్లో నకిలీ మద్యం తయారీ కేంద్రాలపై దాడులు నిర్వహించిన ఎక్సైజ్ అధికారులు తయారీ దారులు కొందరిని అదుపులోకి తీసుకున్నారు. వారి ఇచ్చిన సమాచారంతో గుడ్లూరులో సోదాలు నిర్వహించినట్లు సమాచారం.

మద్యం షాపులతోపాటు బెల్టు దుకాణాలకు సరఫరా

తయారు చేసిన నకిలీ మద్యాన్ని పలు మద్యం షాపులతోపాటు బెల్టు షాపులకు సరఫరా చేస్తున్నారు. ఎక్కడా ఎవరికి అనుమానం రాకుండా మద్యం సీసాలు, వాటిపై లేబుల్స్ పక్కాగా ఏర్పాటు చేసుకున్నారు. లేబుల్‌పై ఒరిజినల్‌ను తలపించే రీతిలో మద్యం బాటిళ్లపై ఉండే లేబుల్, బ్యాచ్ నంబర్లు, ఎమ్మార్పీ ధరలు కూడా తయారు చేసి వేస్తున్నారు. అంతా పక్కాగా వేసి గుట్టు చప్పుడు కాకుండా నకిలీ మద్యాన్ని తయారు చేసి విక్రయిస్తూ రూ.లక్షలు సంపాదిస్తున్నారు.

పేదల ఆరోగ్యంతో చెలగాటం


ఎక్కువగా ఈ మద్యం తక్కువ ధరకు లభించి ఛీప్ లిక్కర్‌ను పోలిన బాటిళ్లు, పలు రకాల బ్రాండ్ల పేర్లతో నకిలీవి తయారు చేస్తున్నట్లు సమాచారం. ఈ మద్యం ధర తక్కువగా ఉండడంతో ఎక్కువగా పేదలు మాత్రమే వీటిని తాగుతుంటారు. ఈ నకిలీ మద్యాన్ని కందుకూరు, లింగసముద్రం, వలేటివారిపాలెం, గుడ్లూరు మండలాలతోపాటు పక్క జిల్లాలకు కూడా సరఫరా చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ప్రధానంగా తీర ప్రాంతాల్లోని గ్రామాల్లో విక్రయిస్తున్నారు. ఇలాంటి నకిలీ మద్యం తయారు చేసి పేద ఆరోగ్యంతో చెలగాటం ఆడుతున్నారు.

విచారణ పేరులో కాలయాపన

ఎక్సైజ్ అధికారులు నకిలీ మద్యం తయారీ దారులను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం ఉంది. అయితే మీడియాకు వివరాలు వెల్లడించేందుకు వెనుకంజ వేస్తున్నారు. విచారణ చేస్తున్నామని పూర్తి విచారణ తర్వాతే సమాచారం ఇస్తామంటూ కాలయాపన చేస్తున్నారు. నకిలీ మద్యం తయారీ నిర్వాహకులను తప్పించేందుకు అధికార పార్టీ పెద్దల నుంచి అధికారులకు ఒత్తిడి వస్తున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. చాలా కాలం నుంచి నియోజకవర్గంలో ఇలాంటి దందాలు నడుస్తున్న అధికారులు స్పందించింది లేదు. బెల్టు షాపుల నిర్వాహణలోనే అధికారులు కనసన్నలోనే జరుగుతున్నట్లు తెలుస్తోంది.

మద్యం, బెల్టు షాపుల్లో తనిఖీ చేస్తే..

టీడీపీ నేత ఉప్పలపాటి వీరాంజనేయరాజు తయారు చేసిన నకిలీ మద్యాన్ని ఇప్పటికే మద్యం, బెల్టు షాపులకు అధిక మొత్తంలో సరఫరా చేసినట్లు తెలుస్తోంది. దుకాణాలపాటు బెల్టు షాపుల్లో ఎక్సైజ్ అధికారులు తనిఖీలు చేస్తే భారీ స్థాయిలో నకిలీ మద్యం పట్టుబడుతుందని తెలుస్తోంది. ఏ దుకాణానికి ఎంత సరుకు సరఫరా చేశారో ఎక్సైజ్ అధికారులు ప్రాథమికంగా గుర్తించినట్లు సమాచారం. నకిలీ మద్యం తాగి అనారోగ్యపాలైన వారిని ఆరోగ్య సిబ్బందితో గుర్తించి అనుమానం వచ్చిన వారికి మెరుగైన వైద్యం అందించాల్సిన అవసరం కూడా ఉందని పలు ప్రజా సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.



నకిలీ మద్యం సీసాలకు ఉపయోగించే లేబుల్స్



నకిలీ మద్యం సరఫరా చేసే వాహనం

నకిలీ మద్యం తయారీ వెనుక అధికార పార్టీ అండదండలు

ఈ నకిలీ మద్యం తయారీ వెనుక మద్యం షాపుల నిర్వాహకులు, అధికార పార్టీ నాయకులు అండదండలు ఉన్నట్లు జోరుగా ప్రచారం జరుగుతోంది. నకిలీ మద్యం తయారు చేస్తూ పట్టుబడిన వీరాంజనేయులు మండలంలోని అధికార పార్టీకి చెందిన ప్రధాన నేతల అనుచరుడు. అసాంఘిక కార్యకలాపాల్లో ఆరితేరినట్లు తెలుస్తోంది. సదరు నాయకుడు మండలంలో పేకాట శిబిరాలు నిర్వహణలో కీలకంగా వ్యవహరిస్తుంటారు.

క్లుప్తంగా

లోకేశ్ పర్యటనను అడ్డుకుంటాం



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

నెల్లూరు(టౌన్): 'ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం నెరవేర్చలేదు. ఈ నేపథ్యంలో మంత్రి లోకేశ్ జిల్లా పర్యటనను అడ్డుకుంటాం' అని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మస్తాన్ షరీఫ్ తెలిపారు. శనివారం నెల్లూరు సంతపేటలోని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్ బకాయిలను విడుదల చేయాలన్నారు. పేద విద్యార్థులను మెడికల్ విద్యకు దూరం చేసే జీఓలను రద్దు చేయాలన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించడం తదితర సమస్యలను పరిష్కరించాలన్నారు. సమావేశంలో ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ నాయకులు హుస్సేన్, సిద్ధూ, అభినవ్, జాహ్నవ్, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్య

నెల్లూరు(క్రైమ్): మహిళ ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. నెల్లూరులోని భగత్‌సింగ్ కాలనీలో ప్రభుత్వ లేఅవుట్‌కు చెందిన దివ్య (26) భర్తతో విడిపోయి తన ఇద్దరు పిల్లలతో తల్లిదండ్రుల వద్ద ఉంటోంది. ఆమెతో సన్నిహితంగా ఉండే సాయికిరణ్ గతనెలలో ఆత్మహత్య చేసుకున్నాడు. అప్పటి నుంచి ఆమె మనస్తాపానికి గురైంది. శనివారం తన ఇంట్లో ఫ్యాన్‌కు చున్నీతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. గుర్తించిన కుటుంబ సభ్యులు ఆమెను చికిత్స నిమిత్తం నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. బాధిత కుటుంబం నవాబుపేట పోలీసులకు ఫిర్యాదు చేసింది. వారు మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు నమోదు చేశారు.

పోక్సో కేసు నమోదు

కొండాపురం: మండలంలోని తూర్పు ఎర్రబల్లి గ్రామంలో బాలికపై ఓ బాలుడు లైంగికదాడి చేశాడు. ఈ ఘటనపై కావలి డీఎస్పీ శ్రీధర్, కలిగిరి సీఐ వెంకటనారాయణ శనివారం గ్రామానికి వెళ్లి విచారించారు. బాలికకు ఇటీవల కడుపునొప్పి రావడంతో తల్లిదండ్రులు ఆస్పత్రికి తీసుకెళ్లారు. గర్భిణి అని చెప్పడంతో వారు కొండాపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. డీఎస్పీ మాట్లాడుతూ పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.

చేతిలో బాణసంచా పేలి యువకుడికి తీవ్రగాయాలు

ఉదయగిరి: మొహర్రం సందర్భంగా ఉదయగిరి పట్టణంలో పెద్దపీరు ఊరేగింపులో బాణసంచా చేతిలో పేలి ఓ యువకుడు తీవ్రంగా గాయపడిన ఘటన శుక్రవారం అర్ధరాత్రి జరిగింది. స్థానికుల కథనం మేరకు.. స్థానిక సినిమాహాల్ వీధికి చెందిన ఫైరోజ్ అనే యువకుడు పెద్దపీరు ఊరేగింపులో పాల్గొని బాణసంచా పేలుస్తుండగా ప్రమాదవశాత్తు అది చేతిలో పేలి తీవ్రంగా గాయపడ్డాడు. అతని చేతి వేళ్లు బాగా దెబ్బతిన్నాయి. కుటుంబ సభ్యులు, స్థానికులు గమనించి చికిత్స నిమిత్తం స్థానిక వైద్యశాలకు తీసుకెళ్లారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం చెన్నైకి తరలించారు.

పొదలకూరు నిమ్మ ధరలు (కిలో)



పెద్దవి : రూ.25
సన్నవి : రూ.15
పండ్లు : రూ.5

1,700 మందితో బందోబస్తు



భద్రతా ఏర్పాట్లను పరిశీలించి సిబ్బందికి సూచనలిస్తున్న ఐజీ

- అప్రమత్తంగా విధులు నిర్వహించాలన్న ఐజీ
- జీ 70 సీసీ కెమెరాల ఏర్పాటు
- విధుల్లో ఇతర జిల్లాల సిబ్బంది

నెల్లూరు(క్రైమ్): రొట్టెల పండగకు జిల్లా పోలీసు శాఖ భద్రతా ఏర్పాట్లు చేస్తోంది. ఎస్పీ జి.కృష్ణకాంత్ పర్యవేక్షణలో నగర డీఎస్పీ పి.సింధుప్రియ పటిష్ఠ భద్రతా చర్యలు చేపట్టారు. జిల్లాతోపాటు గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం జిల్లాలకు చెందిన 1,700 మంది సిబ్బంది బందోబస్తు విధుల్లో పాల్గొంటున్నారు. వారిలో ఎస్పీ, ఏఎస్పీ, పదిమంది డీఎస్పీలు, 50 మంది సీఐలు, 131 మంది ఎస్సైలు, 267 మంది ఏఎస్సైలు/హెచ్‌సీలు, 710 మంది కానిస్టేబుళ్లు, 96 మంది మహిళా కానిస్టేబుళ్లు, 288 మంది హోంగార్డులు, 49 మంది మహిళా హోంగార్డులు, 63 మంది ఏఆర్ సిబ్బందితోపాటు ఐదు స్పెషల్ పార్టీలున్నాయి. దర్గా ఆవరణలో పోలీసు అవుట్ పోస్టును ఏర్పాటు చేశారు. 70 సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి వాటిని కమాండ్ కంట్రోల్‌రూమ్‌కు అనుసంధానం చేశారు. సిబ్బంది 24 గంటలూ కమాండ్ కంట్రోల్‌రూమ్ నుంచి ప్రతి ప్రాంతాన్ని క్షుణ్ణంగా పరిశీలించనున్నారు.

పరిశీలించిన ఐజీ

దర్గాలో రొట్టెల పండగ ఏర్పాట్లను గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి శనివారం ఎస్పీ జి.కృష్ణకాంత్‌తో కలిసి పరిశీలించారు. ట్రాఫిక్ డైవర్షన్స్, ప్రధాన దర్గా, స్వర్ణాల ఘాట్, దర్గా ప్రవేశ, నిష్క్రమణ మార్గాలు, క్యూలైన్లు, కంట్రోల్ రూమ్, అవుట్ పోస్టులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలిచ్చారు. పరిమితికి మించి, లైఫ్ జాకెట్లు లేకుండా యాత్రికులను బోట్‌షికారుకు అనుమతివ్వరాదన్నారు. అనంతరం పోలీసు కవాతు మైదానంలో బందోబస్తు విధులకు హాజరైన సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. స్వర్ణాల ఘాట్ వద్ద రొట్టెలు పట్టుకునే సమయంలో భక్తులను అప్రమత్తం చేస్తుండాలన్నారు. బాంబ్, డాగ్‌స్క్వాడ్‌లు నిరంతర తనిఖీలు నిర్వహించాలన్నారు. క్రైమ్‌పార్టీలు దొంగతనాలు జరగకుండా చూడాలన్నారు. విధుల్లో అలసత్వం ప్రదర్శించినా, గైర్హాజరైనా శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.



కమాండ్ కంట్రోల్ రూమ్‌ను పరిశీలిస్తూ..

సిబ్బందికి సూచనలిస్తున్న డీఎఫ్‌ఓ శ్రీనివాసరెడ్డి



అగ్నిమాపక శాఖ పటిష్ట చర్యలు

- విధుల్లో 132 మంది సిబ్బంది

నెల్లూరు(క్రైమ్): రొట్టెల పండగ నేపథ్యంలో జిల్లా విపత్తు స్పందన, అగ్నిమాపక శాఖ సేవలకు సిద్ధమైంది. ఆ శాఖ జిల్లా అధికారి వాకా శ్రీనివాసరెడ్డి పర్యవేక్షణలో సిబ్బంది చర్యలు చేపట్టారు. 4 ఫైరింజన్లను ఏర్పాటు చేశారు. దర్గా లోపల, ఆవరణలోని దుకాణాల వద్ద 40 మంటల్ని ఆర్పే పరికరాలు ఉంచారు. స్వర్ణాల చెరువు ఘాట్‌ను శుభ్రం చేసేందుకు 10 పోర్టబుల్ పంప్‌సెట్లను పెట్టారు. రెండు రెస్క్యూ బోట్లు సిద్ధంగా ఉంచారు. ఘాట్ వద్ద అవుట్ పోస్టును ఏర్పాటు చేశారు. ఇక్కడ 24 గంటలు సిబ్బంది అందుబాటులో ఉంటారు. నెల్లూరు జిల్లాతోపాటు ప్రకాశం, బాపట్ల, పల్నాడు, గుంటూరు, తిరుపతి, అన్నమయ్య, వైఎస్సార్ కడప జిల్లాలకు చెందిన 132 మంది సిబ్బంది బందోబస్తు విధుల్లో పాల్గొంటున్నారు. మత్స్యశాఖ సహకారంతో 40 మంది గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచారు. శనివారం అవుట్ పోస్టు వద్ద శ్రీనివాసరెడ్డి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. అప్రమత్తంగా ఉంటూ ప్రాణ, ఆస్తినష్టం జరగకుండా చూడాలన్నారు. ఎలాంటి విపత్కర పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు. అనంతరం ఆయన అధికారులతో కలిసి దర్గా ఆవరణ, రొట్టెల మార్పిడి ప్రదేశాలను పరిశీలించారు.

లోక్ అదాలత్‌తో సమయం, డబ్బు ఆదా



మాట్లాడుతున్న జిల్లా జడ్జి శ్రీనివాస్



కార్యక్రమానికి హాజరైన న్యాయవాదులు, సిబ్బంది

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీనివాస్

నెల్లూరు(లీగల్): జాతీయ లోక్ అదాలత్‌లో కేసును రాజీ చేసుకోవడం ద్వారా సమయం, డబ్బు ఆదా అవుతుందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ జి.శ్రీనివాస్ అన్నారు. నెల్లూరులోని జిల్లా కోర్టు ఆవరణలో ఆ సంస్థ ఆధ్వర్యంలో శనివారం జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమన్ని ఏర్పాటు చేశారు. దీనిని శ్రీనివాస్ ప్రారంభించి మాట్లాడారు. కక్షిదారులు రాజీపడి వస్తే లోక్ అదాలత్‌లో సత్వర న్యాయం అందిస్తామన్నారు. కేసుల పరిష్కారానికి కృషి చేసిన కలెక్టర్ ఆనంద్, ఎస్పీ కృష్ణకాంత్, కార్పొరేషన్ కమిషనర్ నందన్, న్యాయాధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఎస్పీ మాట్లాడుతూ రాజీమార్గంతో ఇరుపక్షాలకు స్నేహపూరిత వాతావరణం ఏర్పడుతుందని పేర్కొన్నారు. నందన్ మాట్లాడుతూ కార్పొరేషన్ పరిధిలోని ప్రజలకు బకాయిల కట్టడానికి సువర్ణ అవకాశంగా తీసుకోవాలన్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా జాతీయ లోక్ అదాలత్‌లో 5,359 కేసులు పరిష్కారమై లబ్ధిదారులకు రూ.3,85,45,373ను చెల్లించడం జరిగింది. కోవూరులో 198, కావలిలో 191, ఆత్మకూరులో 153, ఉదయగిరిలో 93, గూడూరులో 204, కోటలో 47, నాయుడుపేటలో 120, సూళ్లూరుపేటలో 98, వెంకటగిరిలో 122 కేసులు పరిష్కారమయ్యాయి.

నెల్లూరులో ఆరు ప్రత్యేక బెంచ్‌లు

నెల్లూరులో వివిధ కోర్టుల్లో జాతీయ అదాలత్‌లో కేసుల పరిష్కారానికి ఆరు ప్రత్యేక బెంచ్‌లను ఏర్పాటు చేశారు. న్యాయమూర్తులు ఎంఏ సోమశేఖర్, ఎస్.శ్రీనివాస్, జి.స్వాతి, ఎల్.శారదారెడ్డి, షేక్ అబ్దుల్ రెహ్మాన్, షేక్ నిషాద్‌నాజ్ ప్రిసైడింగ్ అధికారులుగా వ్యవహరించి 4,133 కేసులు పరిష్కరించారు. కార్యక్రమంలో మొదటి, మూడు, నాలుగు, ఐదు, ఆరు, ఎనిమిది కోర్టుల అదనపు అదనపు జిల్లా న్యాయమూర్తులు, ఏపీ బార్ కౌన్సిల్ సభ్యుడు వేనాటి చంద్రశేఖర్‌రెడ్డి, నెల్లూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అయ్యపరెడ్డి, పోలీస్, బీమా, బ్యాంక్, మున్సిపల్, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.కార్యక్రమాన్ని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.వాణి జిల్లా వ్యాప్తంగా పర్యవేక్షించారు.

పార్టీ మారలేదనే కక్షతో..

- వైఎస్సార్‌సీపీ నేతపై కేసు నమోదు
- రూరల్‌లోని టీడీపీ నేత ప్రమేయం

నెల్లూరు సిటీ: పార్టీ మారలేదని వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా సెక్రటరీ వంశీపై టీడీపీ నేతలు కక్ష కట్టారు. ఓ నాయకుడు చక్రం తిప్పి సంబంధం లేని కేసులో వంశీని ఇరికించాడు. వివరాలిలా ఉన్నాయి. గుండ్లపాళెంలో కొన్నినెలల క్రితం తిరునాళ్ల జరిగింది. గ్రామంలో డ్యాన్స్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. జనసేన నేత శ్రీపతిరామ్ సోదరుడి కుమారుడు వరుణ్‌సాయి అలియాస్ బబ్లూ, చింటూ మద్యం తాగి మహిళలతో అసభ్యంగా ప్రవర్తించారు. గుండ్లపాళేనికి చెందిన వినీత్, గ్రామస్తులు వారిని అడ్డుకుని దేహశుద్ధి చేశారు. ఇది మనసులో పెట్టుకున్న వరుణ్‌సాయి సమయం కోసం వేచి చూశాడు. ఈ క్రమంలో రూరల్ పరిధిలోని ధనలక్ష్మీపురంలో ఓ కేఫ్‌లో శనివారం ఉదయం వినీత్ టీ తాగుతుండగా వరుణ్‌సాయి 15 మందితో అక్కడికి చేరుకున్నాడు. వినీత్ ఫోన్ లాక్కుని బలవంతంగా విశ్వవావిలేటుపాడులోని ఓ నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి దాడి చేశారు. ఈ విషయాన్ని బాధితుడు గుండ్లపాళేనికి చెందిన వారికి తెలియజేడంతో ఆ ప్రాంతానికి చేరుకున్నారు. దీంతో దాడి చేసిన వారు పరారయ్యారు. అయితే వరుణ్‌సాయి ఒక్కడు చిక్కాడు. అతడిని గ్రామానికి తీసుకెళ్లారు. గ్రామస్తులు జనసేన నేత శ్రీపతిరామ్‌కు ఫోన్ చేసి రావాలని చెప్పారు. అతను వెళ్లి వంశీని తనతో పంపించాలని కోరాడు. అయితే గ్రామస్తులు మాత్రం వినీత్‌పై దాడి చేసిన వారిని తీసుకురావాలని చెప్పారు. ఈ నేపథ్యంలో గ్రామస్తులు, శ్రీపతిరామ్ మధ్య చర్చలు జరిగాయి. గుండ్లపాళెంలోని ఓ కార్యక్రమానికి వంశీ వెళ్లాడు. గొడవ జరుగుతుండగా వెళ్లి చూశాడు. శ్రీపతిరామ్ వంశీతో ఉన్న పాత గొడవలను మనసులో పెట్టుకుని బూతులు తిడుతూ రెచ్చగొట్టాడు. ఈ క్రమంలో ఇద్దరి మధ్య తోపులాట జరిగింది. వంశీ పార్టీ మారలేదని కోపంగా ఉన్న రూరల్ పరిధిలోని ఓ టీడీపీ నేత ఆ గొడవను అవకాశంగా తీసుకున్నాడు. పోలీసులపై ఒత్తిడి తీసుకురావడంతో వంశీతోపాటు మరో నలుగురిపై కేసు నమోదు చేశారు. అసలు గొడవ పడిన వారు రాజీ చేసుకున్నారు.

ట్రాఫిక్ విధుల్లో 614 మంది

- అమలులో ఆంక్షలు
- స్థానికుల విషయంలో నిర్లక్ష్యం



పొదలకూరు రోడ్డు జంక్షన్‌లో ఏర్పాటు చేసిన బారికేడ్లు



జిల్లా పోలీస్ కార్యాలయం వద్ద నిలిపిన వాహనాలు

నెల్లూరు(క్రైమ్): రొట్టెల పండగ నేపథ్యంలో నగరంలో ట్రాఫిక్‌కు ఎలాంటి అంతరాయం కలగకుండా ఎస్పీ జి.కృష్ణకాంత్ పర్యవేక్షణలో సౌత్, నార్త్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు వెంకటరెడ్డి, రామకృష్ణ చర్యలు చేపట్టారు. 614 మంది సిబ్బంది మూడు షిఫ్టుల్లో విధులు నిర్వహిస్తున్నారు. శనివారం నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో దర్గాను సందర్శిస్తున్నారు. కాగా దర్గా పరిసర ప్రాంతాల్లో వాహనాలను ఇష్టారాజ్యంగా నిలిపివేయడంతో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తాయి.

దారి మళ్లింపు ఇలా..

శనివారం ఉదయం 7 గంటల నుంచి ట్రాఫిక్ డైవర్షన్లను అమలు చేస్తున్నారు. రెగ్యులర్ వాహనాలను దారి మళ్లించారు. చెన్నై, బెంగళూరు, తిరుపతి, గూడూరు వైపు నుంచి వచ్చే ఆర్టీసీ బస్సులు అయ్యప్పగుడి ఫ్లై ఓవర్, బీవీనగర్, అన్నమయ్య సర్కిల్, ఆర్ఎల్‌పురం, ముత్తుకూరు రైల్వే అండర్‌బ్రిడ్జి, ఏసీ కూరగాయల మార్కెట్ మీదుగా బస్టాండ్‌కు చేరుకుంటాయి. పొదలకూరు వైపు నుంచి వచ్చే బస్సులు డైకస్ రోడ్డు నుంచి నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి సర్కిల్, అయ్యప్పగుడి, బీవీ నగర్, అన్నమయ్య సర్కిల్, రామలింగాపురం, ముత్తుకూరు గేటు రైల్వే అండర్‌బ్రిడ్జి, ఏసీ కూరగాయల మార్కెట్ మీదుగా బస్టాండ్‌కు చేరుకోవాలి. జొన్నవాడ వైపు నుంచి వచ్చే బస్సులు పుత్తా ఎస్టేట్, సెయింట్ జోసెఫ్ స్కూల్, బోసుబొమ్మ, గాంధీ బొమ్మ, ఏసీ కూరగాయల మార్కెట్ మీదుగా ఆర్టీసీకి చేరుకోవాల్సి ఉంది. బట్వాడిపాళెం నుంచి పోలీస్ ఆఫీసు వైపు వెళ్లే వాహనాలను మూలాపేట మీదుగా దారిమళ్లించారు.

- కేవీఆర్ పెట్రోల్ బంకు నుంచి డీకేడబ్ల్యూ కళాశాల వైపు రాకపోకలను నిషేధించారు.

ఆదివారం నుంచి 10వ తేదీ వరకు నెల్లూరు నగరంలోకి భారీ వాహనాల రాకపోకలను నిషేధించారు. పొదలకూరు రోడ్డు సెంటర్, కేవీఆర్ పెట్రోల్ బంకు, బట్వాడిపాళెం జంక్షన్ తదితర ప్రాంతాల్లో బారికేడ్లను ఏర్పాటు చేశారు.

పార్కింగ్ ప్రదేశాలివే..

బెంగళూరు, చెన్నై, తిరుపతి వయా గూడూరు మీదుగా వచ్చే భక్తులు అయ్యప్పగుడి నుంచి మినీబైపాస్ మీదుగా డీమార్ట్ పక్కనున్న సైన్స్ పార్కు వద్ద, అయ్యప్పగుడి నుంచి నేరుగా ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రి ప్రాంగణంలో పార్కింగ్ చేసుకోవచ్చు. విజయవాడ, గుంటూరు, ఒంగోలు, కావలి వైపు నుంచి వచ్చే వాహనాలు ఎస్‌వీజీఎస్ కళాశాల గ్రౌండ్‌లో వాహనాలు పెట్టాలి. అనంతపురం, కడప, బద్వేలు, ఆత్మకూరు వయా జొన్నవాడ నుంచి వచ్చే వాహనాలు డీఎస్ఎన్ మినీ ఫంక్షన్ హాల్ వద్ద పార్క్ చేసుకోవాలి. కడప, రాజంపేట, రాపూరు, తిరుపతి, వెంకటగిరి వయా పొదలకూరు నుంచి వచ్చే వాహనాలు తెలుగుగంగ సమీపంలోని ఆలిండియా రేడియో స్టేషన్ ఎదురు ఖాళీ స్థలంలో పార్క్ చేసుకోవాలి.

పాస్‌లున్న వారికి మాత్రమే..

బట్వాడిపాళెం, డీపీఓ, కేవీఆర్ పెట్రోల్ బంకు, పొదలకూరు రోడ్డు వైపు నుంచి పాస్‌లున్న వాహనాలను మాత్రమే దర్గాకు వెళ్లేందుకు అనుమతిస్తారు.

ఈసారి ఇబ్బందులేనా?

దర్గా పరిసర ప్రాంతాల్లో నివాసం ఉండే ప్రజలకు గతంలో పండగకు ముందుగానే అధికారులు పాస్‌లు మంజూరు చేసేవారు. అయితే ఈసారి పాస్‌లు మంజూరు చేయడంలో సంబంధిత అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారు. ఇప్పటికే రహదారులను అధికారులు బారికేడ్లతో మూసివేశారు. పాస్‌లు మంజూరు చేయని పక్షంలో ఆయా ప్రాంత ప్రజలు పండగ ముగిసేంత వరకూ ఇబ్బందులు ఎదుర్కోవాల్సి ఉంటుంది.